# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి

5 | నిజామాబాద్, మంగళవారం 6 ఆగస్టు 2024 | KAMAREDDY




తరగతి గదికి తాళం వేసి ఉండడంతో నిరసన తెలుపుతున్న జూనియర్ కళాశాల విద్యార్థులు

## కళాశాల తెరిచి.. పాఠాలు చెప్పండి సారూ..

నాగిరెడ్డిపేట, ఆగస్టు 5: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఐదు రోజులుగా తాళం వేసి ఉంటుందని, పాఠాలు చెప్పడం లేదంటూ విద్యార్థులు నిరసన తెలిపారు. కళాశాల నుంచి తహసీల్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ చేపట్టి తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఐదు రోజులుగా అధ్యాపకులు రాక పోవడంతో కళాశాలకు తాళం వేశారన్నారు. దీంతో రోజూ కళాశాలకు వచ్చి మధ్యాహ్నం వరకు బయటే కూర్చొని వెళ్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులకు ఫోన్ చేస్తే ఎవరూ స్పందించడం లేదని పేర్కొన్నారు. వెంటనే కళాశాలను తెరిపించి పాఠాలు చెప్పాలని, నిర్లక్ష్యం వహిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందిస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు

# ప్రజా ప్రభుత్వంపై జనాగ్రహం

- ఉమ్మడి జిల్లాలో ఆందోళనల పర్వం
- బీడీ కార్మికులు, విద్యార్థులు, రైతులు, మహిళల ధర్నా

**సమస్యలు** పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు సోమవారం ఆందోళన కార్యక్రమాలతో దద్దరిల్లాయి. రూ.4వేల జీవనభృతి ఇవ్వాలని బీడీ కార్మికులు, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, చెరుకు ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలని రైతులు, ఇండ్లు, గృహలక్ష్మి పథకం కింద రూ.2500 అందించాలని మహిళలు ధర్నా చేపట్టారు



బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీడీ కార్మికులు, మహిళలు

## కాంగ్రెస్ వాగ్దానాలను అమలు చేయాలి..

శక్కర్‌నగర్, ఆగస్టు 5: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) ఆధ్వర్యంలో బీడీ కార్మికులు ధర్నా నిర్వహించారు. బోధన్, నందిపేట, కమ్మర్‌పల్లి మండల కేంద్రాల్లోని ఆర్డీవో, తహసీల్ కార్యాలయాల ఎదుట ఆందోళన నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత స్థలాలు ఉన్న వారికి ఇండ్ల నిర్మాణానికి రూ.6లక్షలు, గృహలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 ఇస్తామని హామీనిచ్చినా అవి అమలుకు నోచుకోవడం లేదన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించాలన్నారు.

## విద్యారంగంపై నిర్లక్ష్యం వీడాలి..

కామారెడ్డి/కంఠేశ్వర్, ఆగస్టు 5: సమాజంలో క్రియాశీలకంగా ఉన్న విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభు త్వం నిర్లక్ష్యం చేస్తున్నదని పీడీఎస్‌యూ నాయకులు అన్నా రు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తున్నదని అన్నారు. కేవలం ఒకశాతం మాత్రమే నిధులు పెంచి విద్యారంగంపై తన కపట నీతిని బహిర్గతం చేసిందని విమర్శించారు. విద్యారంగంపై దృష్టి సారించాలని, లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.



నవీపేట తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు



కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

## యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి..

కామారెడ్డి,ఆగస్టు 5 :చెరుకు రైతులను మోసం చేసిన గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు, రైతులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్, జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడారు. రైతుల పేరిట క్రాప్‌లోన్ తీసుకొని రుణమాఫీ డబ్బులను కాజేసిన గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి డబ్బులు రికవరీ చేసి రైతులకు ఇప్పించాలని డిమండ్ చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతోపాటు బ్యాంకు అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా నాయకులు ప్రకాశ్, సురేశ్, పరమేశ్, రమేశ్, లింబాద్రి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు, రైతులు

## రూ.4వేల జీవనభృతి ఇవ్వాలి..

నవీపేట, ఆగస్టు 5: ఎన్నికలకు ముందు రూ.4 వేల జీవనభృతి ఇస్తామని చేసిన హామీని కాం గ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని బీడీ కార్మికులు డిమాండ్ చేశారు. ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా నవీపేట, డిచ్‌పల్లి తహసీల్ కార్యాలయాల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ రాష్ట్ర వ్యాప్తంగా ఏడు లక్షల మంది బీడీ కార్మికులు ఉన్నారని, చాలీచాలని వేతనంతో కాలం వెళ్లదీస్తున్న తమకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.4వేల జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవనభృతి అంటూ మభ్యపెట్టి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.

# ఏం తమాషాలు చేస్తున్నారా?

- హామీలపై ప్రశ్నించిన యువతపై ఎమ్మెల్యే ఆగ్రహం
- రోడ్లపై నడవలేకపోతున్నామన్న స్థానికులు
- హామీలు ఏమయ్యాయని అడ్డగించిన యువకులు
- సహనం కోల్పోయిన జుక్కల్ ఎమ్మెల్యే
- తమాషాలు చేస్తున్నారా? అని రెచ్చిపోయిన వైనం
- సమస్యలుంటే క్యాంప్ ఆఫీసుకు రావాలని మండిపాటు



వాహనానికి అడ్డంగా నిలబడిన యువకులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఎమ్మెల్యే

బాన్సువాడ ( జుక్కల్), ఆగస్టు 5: జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు వ్యవహార శైలి ఉమ్మడి జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైంది. సమస్యలు దృష్టికి తీసుకొచ్చేందుకు యత్నించిన యువకులపై రుసురుసలాడడం వివాదాస్పదంగా మారింది. ఏం తమాషాలు చేస్తున్నారా ? అంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంపై స్థానికుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించినందుకు సమాధానం చెప్పకుండా సమస్యలేమైనా ఉంటే క్యాంప్ ఆఫీస్‌కు వచ్చి మాట్లాడాలని దురుసుగా సమాధానం చెప్పడంపై యువకులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌తో కలిసి సోమవారం జుక్కల్ మండల కేంద్రానికి వచ్చారు. అధికారిక కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఊహించని విధంగా పరాభవం ఎదురైంది. నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి దారుణంగా ఉందని, కనీసం నడవలేని పరిస్థితి ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా చిన్న సమస్య కూడా పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు సమస్యలను దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుండగా లక్ష్మీకాంత్‌రావు సహనం కోల్పోయారు. తమాషాలు చేస్తున్నారా ? అంటూ బెదిరించారు. రోడ్లు బాగా లేవని తాము అడిగితే, తమాషాలా అంటూ ఎవరిని అంటున్నారని యువకులు నిలదీశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని స్థానిక యువకులు లక్ష్మీకాంతరావు కారుకు అడ్డంగా నిలుచున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే క్యాంప్ కార్యాలయానికి వచ్చి మాట్లాడాలని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో యువకులు గట్టిగా నిలదీయడంతో లక్ష్మీకాంత్‌రావు అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు. త మ ఇబ్బందులు చెప్పుకునేందుకు యత్నిస్తే ఎమ్మెల్యే దురుసుగా మాట్లాడడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# బ్యాంకు ఎదుట రైతుల ధర్నా



కల్లూర్‌లోని కెనరా బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పొతంగల్, ఆగస్టు 5 : మండలంలోని కల్లూర్ కెనరా బ్యాంకు ఎదుట రైతులు సోమవారం ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. తమకు మొదటి విడుతలో రూ. లక్షలోపు రుణం కూడా మాఫీ కాలేదని, వ్యవసాయాధికారులను అడిగితే రెండో విడుతలో అవుతుందని చెప్పారని, ఇంకా కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో విడుతలో రూ.లక్షన్నర మాఫీకాని రైతులు సైతం ఆందోళనలో పాల్గొన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఏవో శ్రీనివాస్ చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.


## స్వచ్ఛదనం పచ్చదనం



మాక్లూర్ మండలం అమ్రాద్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

**గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో** పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు ఉద్దేశించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లాలో సోమవారం ప్రారంభించారు. అధికారులు, గ్రామస్తులు ర్యాలీలు నిర్వహించి మొక్కలను నాటారు. గ్రామసభలు ఏర్పాటుచేసి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రధాన కూడళ్ల వద్ద ప్రతిజ్ఞ చేశారు.

శెట్లూర్ శివారులో డంప్ చేసిన ఇసుక కుప్పను సీజ్‌చేసిన రెవెన్యూ అధికారులు



నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

# ఇసుక డంప్ సీజ్

బిచ్కుంద, ఆగస్టు 5: ఇసుక అక్రమ రవాణాపై పగలు ట్రాక్టర్లు.. రాత్రి టిప్పర్లు అనే శీర్షికతో జూలై 31న నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మైనింగ్ అధికారులు ఇటీవల ఖత్‌గావ్, శెట్లూర్, హస్గుల్, బీర్కూర్ ఇసుక క్వారీలను రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. కాగా సోమవారం శెట్లూర్ శివారులో అక్రమంగా డంప్ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సురేశ్ హెచ్చరించారు.

## ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా తారాచంద్ నాయక్

ఖలీల్‌వాడి, ఆగస్టు 5: ఉమ్మడి జిల్లాల ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా తారాచంద్‌నాయక్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో సోమవారం ఎన్నిక ప్రక్రియ నిర్వహించగా పదవీ కోసం కాంగ్రెస్ నుంచి ఇద్దరు పోటీపడ్డారు. రాంపూర్ సొసైటీ అధ్యక్షుడు తారాచంద్ నాయక్, గాంధారి సొసైటీ అధ్యక్షుడు సాయన్న నామినేషన్లు వేశారు. అనంతరం సాయన్న తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో తారాచంద్‌నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రామ్మోహన్ రావు ప్రకటించారు. ఇదిలా ఉండగా నామినేషన్ ఉపసంహరించుకున్న సాయన్నకు డీసీసీబీ వైస్‌చైర్మన్ పదవీ ఇస్తామని హామీనిచ్చినట్లు సమాచారం.

# అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

- ఆన్‌లైన్‌లో నమోదు ఆలస్యంతో వర్తించని రుణమాఫీ
- అధికారులకు రైతుల ఫిర్యాదు

లింగంపేట, ఆగస్టు 5: సహకార సంఘం అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. రైతుల రుణాల వివరాలను ఆన్‌లైన్‌లో ఆలస్యంగా నమోదు చేయడంతో చాలా మందికి మాఫీ రాలేదు. లింగంపేట మండల కేంద్రంలోని సహకార సంఘంలో వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన 1559మంది రైతులు రుణాలను తీసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రుణ మాఫీ మొదటి, రెండో విడుత జాబితాల్లో చాలా మంది పేర్లు కనిపించలేదు. మొదటి విడుతలో 513మందికి, రెండో విడుతలో 100 మందికి మాఫీ వర్తించింది. మిగిలిన రైతులకు మాఫీ రాలేదు. రుణాలు పొందిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో కటాఫ్ తేదీ తర్వాత నమోదు చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. 2023 డిసెంబర్ 9వ తేదీలోగా ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా 2023 డిసెంబర్ 21 నుంచి 2024 ఫిబ్రవరి 13వ తేదీ వరకు రుణాలు తీసుకున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో మాఫీ వర్తించలేదని రైతులు వాపోతున్నారు.

**రుణమాఫీ వర్తింపజేయాలి..**

రుణమాఫీ తమకు వర్తింపజేయాలని రైతులు సోమవారం వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. సహకార సంఘం సిబ్బంది నిర్లక్ష్యంతో తమకు మాఫీ వర్తించలేదని అన్నారు. సుమారు 75మంది రైతులకు రూ.50లక్షల వరకు రుణమాఫీ రావాల్సి ఉన్నదని పేర్కొన్నారు.


**ఇంకో లిస్టులో వస్తదని చెబుతున్నారు**



నేను లింగంపేట సహకార సంఘంలో రూ.80వేలు రుణం తీసుకున్నాను. ప్రభుత్వం ప్రకటించిన రుణ మాఫీకి సంబంధించి మెస్సేజ్ రాకపోవడంతో కార్యాలయానికి వచ్చాను. అధికారులను అడిగితే మరో లిస్టు వస్తుందని, అప్పుడు మాఫీ వస్తుందేమోనని చెబుతున్నారు. ప్రభుత్వం విధించిన కటాఫ్ తేదీ సమయంలోనే రుణం తీసుకున్నా.

- రమావత్ జెగ్యానాయక్, బోనాల్ తండా

**నో డాటా, నో ఎంట్రీ అని చూపుతుంది**



నాకు రుణమాఫీ ఎందుకు కాలేదో తెలుసుకోవడానికి రైతువేదికకు వచ్చాను. ఆన్‌లైన్‌లో వివరాలు చూస్తే నో డాటా, నో ఎంట్రీ అని చూపుతుంది. నేను 2018సంవత్సరంలో రూ.18వేలు క్రాప్‌లోన్ తీసుకున్నాను. రూ.లక్షలోపు రుణ మాఫీ ప్రకటించిన సమయంలో మాఫీ అయినట్లు నాకు మెస్సేజ్ రాలేదు. సహకార సంఘం అధికారుల నిర్లక్ష్యంతోనే నాకు మాఫీ కాలేదు.

- నీరడి లక్ష్మి, పోతాయిపల్లి

## శ్రావణమాస పూజలు

**శ్రావణమాసం** తొలి సోమవారం పురస్కరించుకొని శైవక్షేత్రాలు భక్తులతో సందడిగా మారాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయం, బోధన్ ఏకచక్రేశ్వరాలయం, భిక్కనూరు సిద్దిరామేశ్వరాలయం, ఆర్మూర్ నవసిద్ధుల గుట్ట తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయంలో భక్తుల సందడి